క్రికెట్ టోర్నీ విజేత కుమ్మూరు

చింతూరు: మండల కేంద్రంలో జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో కుమ్మూరు జట్టు విజేతగా నిలిచింది. కుమ్మూరు, చింతూరు బ్లూస్టార్ జట్ల మధ్య శనివారం జరిగిన ఫైనల్ పోటీలో కుమ్మూరు జట్టు 10 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 57 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. విజేతలకు ఈనెల 26న ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేయనున్నారు. విన్నర్, రన్నర్‌గా నిలిచిన జట్లను ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ అభినందించారు.

కోడిపందాలకు దూరంగా ఉండాలి

రంపచోడవరం: సంక్రాంతి పండుగను సంప్రదాయంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని రంపచోడవరం ఎస్ఐ వెంకట్రావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందెలు, గుండాట, జూదాలకు దూరంగా ఉండాలన్నారు. సంప్రదాయ ఆటలతో సంతోషంగా గడపాలన్నారు. ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తుగా పలువురుపై బైండోవర్ కేసులు పెట్టినట్టు తెలిపారు.

కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల నిర్వహణతో విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలగడంతో పాటు పండుగల ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. విద్యార్థులకు రంగవల్లులు, మెహిందీ, కేశాలంకరణ, పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎటపాక: డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీలో సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బోగి మంటలతో సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మి.కార్యదర్శి జకరయ్య, కరస్పాండెంట్ రాజశేఖర్ తదితరులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ హతిరాం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

శాకాహారంతో ఆరోగ్యం

చింతపల్లి: శాకాహార ప్రాధాన్యతపై పాకలుపాడు గురువులు భీమసింగి ఆశ్రమ భక్తులు చింతపల్లిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శాకాహారంతోనే మంచి ఆరోగ్యం కలుగుతుందని, మాంసాహారాన్ని వీడాలని కోరారు.

చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన పాకులుపాడు గురుదేవులు భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు ఎంపీడీవో కుమార్ తెలిపారు.

సీజేఐ సంజీవ్ కన్నా బృందం ఆదివారం అరకులోయ పర్యటనలో భాగంగా స్థానిక పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బోసుపురం నుంచి రహదారికి ఇరువైపులా, అనంతగిరి కాఫీ తోటలు, తాడిగుడ జలపాతం, బొర్రా గుహల వద్ద పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ఈఓపీఆర్డీ లాలం సీతయ్య, కార్యదర్శి దేవా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

దుంబ్రిగుడ: కొర్ర గ్రామంలో ఎంపీటీసీ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను ఎంపీటీసీ జి.విజయ పరిశీలించారు. డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడితే గతంలో గ్రామంలో పరిస్థితి దారుణంగా ఉండేదని గుర్తు చేశారు, ప్రస్తుతం డ్రైనేజీ పనులు చేస్తుండడంతో వీధులన్నీ బాగుపడతాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి, గణపతి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ మృతికి సంతాపం

మారేడుమిల్లి: చావిడికోట పంచాయతీ నిర్మచెట్టు బంద గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పల్లాల శివలింగభూపతిరెడ్డి(55) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులుత తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

కొయ్యూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా సంపరి శివకుమార్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా పార్టీ అధ్యక్షుడే రాజారావు, అసెంబ్లీ ఇన్‌చార్జి కృష్ణారావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సురేష్‌కుమార్‌కు డాక్టరేట్



ఏయూలో డాక్టరేట్ అందుకుంటున్న సురేష్‌కుమార్

హుకుంపేట: ఆంధ్రా యూనివర్సిటీలో పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ పరిశోధక విద్యార్థి తెడబారికి సురేష్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు చేతుల మీదుగా సురేష్‌కుమార్ శనివారం డాక్టరేట్‌ను పత్రాన్ని అందుకున్నారు. ఉమ్మడి విశాఖ మన్యంలోని పేదవర్గానికి చెందిన సురేష్ కుమార్ డాక్టరేట్ పొందడంపై తల్లిదండ్రులు సన్యాసిరావు, సింహాచలంతో పాటు భార్య లిల్లిసురేష్, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా సేవల నిమిత్తం డాక్టర్ వైఎస్సార్, టిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో గిరిజనులకు సేవ కార్యక్రమాలు చేస్తున్నట్టు సురేష్‌కుమార్ తెలిపారు.

మన్యం.. పర్యాటక ధామం

- ప్రధాన వాణిజ్య కేంద్రంగా పాడేరు
- సందర్శిత ప్రాంతాల్లో నిత్యం తాకిడి

పాడేరు : మన్యం పేరు చెప్తే ప్రధానంగా గుర్తొచ్చేది పర్యాటకం. పాడేరు పరిసర ప్రాంతాల్లో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ప్రధానంగా వంజంగి **మేఘాల కొండ, కొత్తపల్లి జలపాతాలు, లంబసింగి, చెరువులవెనం మంచు అందాలు, తాజంగి రిజర్వాయర్, జిప్‌లైన్, మోదకొండమ్మ తల్లి వ్యూపాయింట్,** సీలేరు పవర్ ప్రాజెక్టు ,డ్యాం ఇలా అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. స్థానిక ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టి పడేస్తాయి. ఏడాది పొడవునా ఇక్కడికి వేలాది సంఖ్యలో పర్యాటకులు తరలివస్తారు. దీంతో పర్యాటక ప్రదేశాలన్ని నిత్యం కళకళాడుతోంది.

➡ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, మన్య ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ తల్లీ ఆలయంతో పాటు ధారకొండలో ధారాలమ్మ తల్లీ ఆలయాల్లో ప్రతి రోజు వందలాది సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుంటారు.

➡ ఇక వాణిజ్య పరంగా కూడా ప్రత్యేకత ఉంది. స్థానిక గిరిజనులు సుమారు లక్ష ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో కాఫీ, మిరియాల సాగు చేస్తున్నారు. అంతర్జాతీయంగా ఇక్కడ సాగు చేసే కాఫీకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది.



వంజంగి మేఘాల కొండపై నుంచి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

రాజ్‌మా, పసుపు వంటి వాణిజ్య పంటలతో పాటు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను. మిల్లెట్స్‌ను గిరిజనులు ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీటిని గిరిజనులు గిరిజన సహకార సంస్థకు విక్రయిస్తారు. మరి కొంతమంది వ్యాపారులకు వికయిస్తారు.

➡ జిల్లా కేంద్రం కావడంతో రోజు,రోజుకు అభివృద్ధి చెందుతూ ప్రధానమైన పట్టణంగా రూపాంతరం చెందుతోంది.

రద్దీగా పాడేరు పట్టణం

జిల్లా వాసులకు ప్రధాన కేంద్రంగా ఉన్న పాడేరు రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అరకులోయ, రంపచోడవరం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 22 మండలాలకు పాడేరు వంటి ప్రధాన కేంద్రంగా ఉంది. పాడేరులో కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంతో, ప్రధానమైన ఐటీడీఏతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పాడేరు పట్టణం జనసంచారంతో నిత్యం రద్దీగా సందడిగా మారింది. పాడేరులో నగల దుకాణాలు, వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు హార్డ్‌వేర్, ఫర్నీచర్ దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటైంది. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కేంద్రం కూడా అందుబాటులో ఉంది. జన సంచారం అధికంగా ఉండటంతో వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగానే జరుగుతున్నాయి.



పాడేరులోని ప్రధాన మార్కెట్



మోదకొండమ్మ ఆలయం

పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం





పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్‌ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షలు మృత్యువాత పడుతున్నాయి.

నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసాగించే వాతావరణాన్ని కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పక్షులకు ఆహారం, నీరు అందించి, ఇంటి ఆవరణలో వరి కంకులు, గూళ్లు అమర్చి పక్షులకు నివాసాన్ని కల్పించాలి. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలు, రామ చిలుకలు ఇతర పక్షులను కాపాడుకునేలా సత్వా నేచురల్స్ కృషి చేస్తోంది. రైతుల నుంచి వరి కంకులు సేకరించి అదే ధరకు తమ స్టోర్‌కు వచ్చే కస్టమర్లకు అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాం.

– **వి.లక్ష్మీ తేజ**, సత్వా నేచురల్స్, సీతమ్మధార, విశాఖపట్నం

నమ్మకానికి.. నాణ్యతకు మారుపేరు నాయుడు జ్యూయలర్స్..



మల్టీమాల్స్ తరహాలో నర్సీపట్నంలో నాయుడు జ్యూయలర్స్ రూపుదిద్దుకుంది. పట్టణ నడిబొడ్డులో దశాబ్దాల కింద చిన్న జ్యూయలరీ షాపుతో ప్రారంభించిన వ్యాపారం మల్టీమాల్ స్థాయికి తీసుకువచ్చారు. శుభకార్యాలకు, పండగలకు గుర్తుకు వచ్చేది న్యాయుడు జ్యూయలర్స్ మాత్రమే. గ్రామీణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేందుకు అనేక మోడల్స్ అందిస్తున్నామని మాల్ అధినేత గోవింద్ తెలియజేశారు.

జీవనశైలిలో మార్పుల వల్లే క్యాన్సర్



మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఉబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం ఆయుస్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దార్రిద్య రేఖకు దిగువున ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్,
మేనేజింగ్ డైరెక్టర్,
ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి , విశాఖపట్నం